
తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 120
పేజీలు : 6
వెల : 4
మల్కాజిగిరి
శుక్రవారం, 17-11-2023




## జయభేరి అక్షర తూటా



జాతీయ పార్టీల కాలం చెల్లిందట..
ప్రాంతీయ పార్టీలదే హవా కొనసాగుతుందట..

అయ్యో దొర...
చరిత్ర పుటల్లో దాగిన సత్యాలని ఎట్లా మరిచిపోతావ్...

అసలు ప్రాంతీయ పార్టీల జీవితకాలం ఎంత!?

ఎన్నాళ్ళకైనా ఎన్నేళ్లకైనా జాతీయ పార్టీలో విలీనం కాక తప్పదు....

తెలంగాణ రాష్ట్రం కొరకు కాంగ్రెస్లో విలీనం చేస్తా అని చెప్పిన మాట ఎట్లా మరిచిపోతివి ఇప్పుడు ఎట్లా పసిడి పలుకులు పలుకుతుంటివి....
అని జనాలు గుసగుస పెట్టుకుంటున్నరు సారు...

...కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889



## అధికారం ఇవ్వండి..

3 లో



## ఎత్తైన కొండపై సమంత..

7 లో



2 లో

# అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు

తెలంగాణలో పేదలు బతికే పరిస్థితే లేదని, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగమాగం చేశారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం జవహర్ నగర్ లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు మేడ్చల్ కు తెస్తామన్న ఐటీ పార్కు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. జవహర్ నగర్ ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చింది డంపింగ్ యార్డేనని ఎద్దేవా చేశారు. డంపింగ్ యార్డు విషయంలో కోర్టుకు వెళ్లి ఆదేశాలు తీసుకొచ్చినా తరలించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలను ఆదుకుంటామని, ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. 'మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2,500 అందిస్తాం.

# మౌత్ పబ్లిసిటీ భయంలో గులాబీ


సినిమాల విజయంలో మౌత్ పబ్లిసిటీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అలాగే ఎన్నికలలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే విషయంలో కూడా మౌత్ పబ్లిసిటీ కీలక పాత్ర పోషిస్తుందనీ, గతంలో సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మౌత్ పబ్లిసిటీ ప్రాధాన్యత మరింత పెరిగిందనీ పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో దాదాపు మీడియా అంతా ఏకపక్షంగా మారిపోయిన పరిస్థితులలో మౌత్ పబ్లిసిటీ ప్రజాభిప్రాయం ఎలా ఉందన్న విషయంపై పరిశీలకులే కాదు పార్టీలు కూడా మౌత్ పబ్లిసిటీ మీదే ఆధారపడుతున్నాయి.

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 16 :**

మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఇంతగా ప్రతి ఇంటికీ చేరువైన ఈ రోజులలో కూడా ఎన్నికలు, ఫలితాలు మౌత్ పబ్లిసిటీ మీద ఆధారపడి ఉండటం ఏమిటి వింతగా ఉందే అనిపించక మానదు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అలాగే ఉందని పరిశీలకులు అంటున్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో ఇప్పటిలా మీడియా పెద్దగా ప్రజలకు చేరువగాని సమయంలో ప్రజా ఉద్యమాల నిర్మాణంలో మౌత్ పబ్లిసిటీదే ప్రధాన పాత్రగా ఉండేది. మహాత్మాగాంధీ సహాయనిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, దండి సత్యాగ్రహం వంటి ఉద్యమాలకు ఇచ్చిన పిలుపు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే జనాలకు చేరిందని చెబుతారు. అప్పట్లో మీడియా పాత్ర పరిమితం. అలాగే అక్షరాస్యత కూడా స్వల్పమే. చదువుకున్న కొద్ది మంది అందుబాటులో ఉన్న వార్తాపత్రికలను చదివి, ఆ విశేషాలను జనాలకు వివరించి చెప్పేవారు. అలా విన్న వారు మరి కొందరికి... విషయం ప్రజలందరికీ చేరేది. ఇందుకు అప్పట్లో వారం నుంచి పది రోజుల సమయం పట్టేదని ఒక అంచనా. అయితే ఇప్పుడు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా దాదాపుగా అందరికీ అందుబాటులోకి వచ్చేశాయి. అక్షరాస్యులు కూడా గణనీయంగా పెరిగారు. అయితే మీడియాపై విశ్వసనీయత మాత్రం ఏదో ఒక మేరకు సన్నగిల్లింది. అందులో సందేహం లేదు. తెలంగాణ విషయమే తీసుకుంటే.. రాష్ట్రంలో దాదాపు మీడియా అంతా అధికార పార్టీ ప్రచారానికే ఎక్కువ సమయం, స్థలం కేటాయిస్తున్న

మిగతా 2 లో

# పెరుగుతున్న వాయుకాలుష్యం



**జయభేరి, న్యూ ఢిల్లీ, నవంబర్ 16**

దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతున్నది. దీపావళి తర్వాత జాతీయ రాజధాని కాలుష్యం తారాస్థాయికి చేరింది. నగరంలో ఎక్కడ చూసినా దట్టంగా పొగమంచు పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు శ్వాస తీసుకొనేందుకు ఇబ్బందులుపడుతున్నారు. చలికాలంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వంతో పాటు వివిధ ఏజెన్సీలు విఫలమవుతున్నాయి. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గురువారం ఉదయం తీవ్రమైన కేటగిరిలోనే నమోదైంది.జహంగీర్పురాలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఏక్యూఐ సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది. అలాగే ఆనంద్ విహార్లో 453, నరేలాలో 482, పంజాబీ బాగ్లో 481, ఆర్కేపురంలో 430 నమోదైనట్లు తెలిపింది. రోజురోజుకు గాలి నాణ్యత క్షీణిస్తుండడంతో ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. అయితే, శనివారం వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (IITM) ప్రకారం.. బుధవారం ఉత్తర దిశ నుంచి గంటకు నాలుగు కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలి వేగం తగ్గడంతో కాలుష్యం పెరిగింది. శుక్రవారం ఉత్తర, వాయువ్య దిశల నుంచి గాలులు వీస్తాయని, గంటకు 4 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది.

# ఐదోసారి సీఎం.. అవుతారా



**జయభేరి, భోపాల్, నవంబర్ 16 :**

శివరాజ్ సింగ్ చౌహాన్.. ఈ పేరు మధ్యప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం. మూడు దశాబ్దాల రాజకీయ జీవితం.. 13 ఏండ్లకే ఆర్ఎస్ఎస్లోకి ఎంట్రీ. అనంతరం ఒకటీ కాదు రెండు కాదు ఏకంగా నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. తాజాగా మధ్యప్రదేశ్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో మరోసారి విజయఢంకా మోగించి.. ఐదోసారి సీఎం పదవిని చేపట్టాలని ఉవ్విళ్లురుతున్నారు. మధ్యప్రదేశ్లోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చౌహాన్.. తిరుగులేని నేతగా ఎదిగారు. నాలుగుసార్లు సీఎం పదవిని చేపట్టడం అంతా ఆషామాషీ విషయం కాదనే చెప్పాలి. ఇదిలావుంటే.. శివరాజ్సింగ్ చౌహాన్ సెహూర్ జిల్లాలోని జైత్ గ్రామంలో ప్రేమ్ సింగ్ చౌహాన్, సుందర్ బాయి చౌహాన్ దంపతులకు మార్చి 5, 1959న జన్మించారు. భోపాల్లోని మోడల్ హయ్యర్ సీనియర్ సెకండరీ స్కూల్లో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఇదే భోపాల్లోని బర్కతుల్లా యూనివర్సిటీ నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని కంప్లీట్ చేశారు. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్ తన 13 సంవత్సరాల వయస్సులోనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో చేరారు. దానికి అనుబంధంగా విద్యార్థి విభాగమైన ఏబీవీపీలో పలు

మిగతా 2 లో

# తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుంది చిదంబరం కీలక వ్యాఖ్యలు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 16**

నిరుద్యోగం, అధిక ధరల్ని నియంత్రించడంలో విఫలం అయిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు కోపంతో ఉన్నారని ఈ కోపాన్ని నవంబర్ 30న ఓటు రూపంలో చూపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిందబంరం పిలుపునిచ్చారు. గ్యాస్ సిలిండర్ ధర హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం హైదరాబాద్ వచ్చిన ఆయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అర్బన్ నిరుద్యోగం దేశంలో కన్నా ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉందని అన్నారు. రాష్ట్రప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 80 వేల ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. దీంతో

మిగతా 2 లో



# గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలని యూఎన్ తీర్మానం..

**జయభేరి, ఐక్య రాజ్యసమితి నవంబర్ 16**

ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధం నేపథ్యంలో గాజాలో మానవతా సహాయం కోసం యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానానికి 12 దేశాలు మద్దతు తెలిపారు. అమెరికా, రష్యా, బ్రిటన్లు ఓటింగ్లో పాల్గొనలేదు. గాజా స్ట్రిప్లో మానవతా సహాయం కోసం అంతర్జాతీయ మానవతా చట్టానికి చట్టబడి ఉండాలని తీర్మానం డిమాండ్ చేసింది. పిల్లలకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది. చైనా, రష్యాలు తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని కోరుతుండగా.. అయితే,

మిగతా 2 లో



ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం.' అని వెల్లడించారు. సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ జిల్లాలో తోడు దొంగల్లా భూకబ్జాలకు పాల్పడుతున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో మల్లారెడ్డి పేదోళ్ల గుడిసెలు కూల్చి, వారికి నీడ లేకుండా చేశారని మండిపడ్డారు. చెరువుల పక్కన భూములు కొని వాటిని మింగిన ఘనుడు మల్లారెడ్డి అని, అధికారులు అలాంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని నిలదీశారు. టికెట్లు అమ్ముకున్న మల్లారెడ్డికే కేసీఆర్ మళ్లీ టికెట్లు ఇచ్చారని, మరి కేసీఆర్ ఎన్ని వందల కోట్లకు టికెట్లు అమ్ముకున్నారో అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందని, ప్రజాధనం వృథా అయ్యిందని దుయ్యబట్టారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి ఆగం చేసిన కేసీఆర్ ను పొలిమేరలు దాటే వరకూ తరమాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మేడ్చల్ కు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న ఐటీ పార్కు ఎక్కడికి పోయిందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ముదిరాజ్ లకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, కేసీఆర్ ను గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. హస్తం గుర్తుకు ఓటేసి తమను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రజలకు హామీల జల్లు కురిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. రైతులందరికీ ఉచిత విద్యుత్, ఉపాధి హామీ పనికి వెళ్లే ప్రతి ఒక్కరికీ రైతు బంధు కింద రూ.12 వేలు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు యువ వికాసం కింద రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. పేదింట్లో ఆడపిల్ల పెళ్లికి రూ.లక్ష నగదు, తులం బంగారం అందిస్తామన్నారు

## గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం

ఆగ్నేయాసియా దేశాల కూటమి యుద్ధాన్ని ఆపాలని విజ్ఞప్తి చేసింది.గాజాపై దాడులను వెంటనే ఆపాలని ఆగ్నేయాసియా దేశాల రక్షణ మంత్రుల సమావేశం బుధవారం ఇజ్రాయెల్కు సూచించింది. మానవతా సహాయం కోసం సురక్షితమైన కారిడార్ను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. ఇదిలా ఉండగా.. గాజాలో ప్రధాన ఆసుపత్రి అల్ షిపా ఆసుపత్రిని ఇజ్రాయెల్ సైన్యం తన నియంత్రణలోకి తీసుకున్నది. ఆసుపత్రిలో దాచిన పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. అంతకు ముందు ఆసుపత్రి వద్ద హమాస్కు, ఇజ్రాయెల్ సైన్యానికి మధ్య కాల్పులు జరిగాయి. ఇంకా ఆసుప్రతిలో ఉగ్రవాదులు ఉండవచ్చని ఐడీఎఫ్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతి మూలలోనూ గాలిస్తున్నది.లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి హమాస్ ఉగ్రవాదులు లొంగిపోవాలని కోరుతున్నది. అయితే, ఇజ్రాయెల్ సైన్యం అల్ షిఫా ఆసుపత్రిపై నియంత్రణ సాధించడంతో అక్కడి వైద్యులను సంప్రదించడం సాధ్యంకాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. రోగులు, సిబ్బంది సహా దాదాపు 2300 మంది ఆసుపత్రిలో ఉన్నారని ఐరాస పేర్కొంది. గాజాలో యూఎన్ రిలీఫ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్స్ మాట్లాడుతూ ఆసుపత్రులు యుద్ధ భూమికాదన్నారు. నవజాత శిశువులు, రోగులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రిలోని పౌరుల భద్రతపై ఇతరవాటి కంటే ఎక్కువ ఆందోళన ఉండాలన్నారు. దీనిపై ఐడీఎఫ్ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కర్నల్ పీటర్ లెర్నర్ మాట్లాడుతూ హాస్పిటల్ కాంప్లెక్స్ను హమాస్ ప్రధాన కార్యాలయంగా ఉపయోగిస్తుందనడానికి బలమైన ఆధారాలు లభించాయని చెప్పారు.

## చిదంబరం కీలక వ్యాఖ్యలు

నిరుద్యోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ ఉందని స్పష్టం చేశారు. ఇది దేశ సగటు కన్నా ఎక్కువగా ఉందని చిదంబరం తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని కూడా అమలు పర్చలేదని చిదంబరం విమర్శించారు. నిరుద్యోగం, అధిక ధరల్ని నియంత్రించడంలో తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయిందన్నారు. తెలంగాణ పర్భుత్వం అప్పు 3.66 లక్షల కోట్లకు చేరుకుందని చిదంబరం తెలిపారు. ప్రతి తెలంగాణ పౌరుడిపై అప్పు లక్షకు చేరుకుందని చిదంబరం ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఆయన తెలిపారు.తెలంగాణ నిరుద్యోగ రేటు పురుషుల్లో 7.8 (మహిళల్లో 9.5 గా ఉంది. గ్రామీణ నిరుద్యోగ రేటు జాతీయ సగటు కన్నా అధికం. రాష్ట్రంలో 15.1 శాతంగా ఉంది. 1.91 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 20 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయలేదు. టీఎస్పీఎస్సీలో 22 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్టర్ అయ్యారు. ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైంది. రాష్ట్ర అప్పులు 3.66 లక్షల కోట్లకు పెరిగింది. ఏటేటా అప్పులు భారీగా పెరిగాయి. ఫలితంగా ఒక్కొక్కరిపై 96 వేల రూపాయల అప్పు భారం పడింది. దీంతో సంక్షేమ పథకాల అమలు కష్టంగా మారిందని చిదంబరం విశ్లేషించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. మాట తప్పకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చామని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం చెప్పారు.

**ప్రజా ఉద్యమం వల్లే తెలంగాణ**

కాంగ్రెస్ కి ఒక్క అవకాశం ఇవ్వండి అని తెలంగాణ ప్రజలకు మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పరుస్తాం.. ఉద్యోగాలు, సంక్షేమం అందించే బాధ్యత మాది అని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే.. ఆరు గ్యారంటీలు అమలులోకి వస్తాయి.. అన్ని రాష్ట్రాల్లో తలసరి ఆదాయం పెరుగుతుంది.. కానీ ధరల నియంత్రణ, ఉద్యోగాల నియామకం సంగతి ఏమైంది.. కేసీఆర్ కి చరిత్ర సరిగ్గా తెలిసి ఉండదు.. తెలంగాణ స్టేట్ కాదు.. మద్రాస్ రాష్ట్రంగా ఉండే.. తెలుగు మాట్లాడే వాళ్లంతా ఒక రాష్ట్రంగా ఏర్పాటులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడింది.. కేసీఆర్ అప్పట్లో నాకు ఏం చెప్పారు.. నేనేం చెప్పాను అనేది ఇద్దరికి తెలుసు అని చిదంబరం అన్నారు.తెలంగాణా బిల్లు పాస్ అవ్వడానికి ముందు బిల్లు పాస్ అయ్యాకా కేసీఆర్ ఏం మాట్లాడారో మాకు తెలుసు అని చిదంబరం తెలిపారు. కేసీఆర్ లాగా వ్యక్తుల సామర్థ్యం గురించి మాట్లాడను.. ప్రతీ జనరేషన్ లో ఓ మంచి నాయకుడి వస్తారు.. తెలంగాణ కాంగ్రెస్ లో కేపబుల్ లీడర్స్ ఉన్నారు.. తెలంగాణని సేఫ్ గా చూస్తారు.. ప్రజలు ఆరు గ్యారంటీలను నమ్ముతున్నారు.. హ్యాపీగా ఫీల్ అవుతున్నారు అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ లో 12 మంది సీఎం అభ్యర్థులు ఉన్నారంటే అది పార్టీ బలం.. కాంగ్రెస్ లో 12 మంది సమర్థవంత నేతలు ఉన్నారు అని అర్థం.. కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యం అందుకు నిదర్శనం అని చిదంబరం వెల్లడించారు.లిక్కర్ స్కామ్లో కవిత పాత్ర గురించి నాకు తెలియదు అని చిదంబరం చెప్పారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్లో ఏముందో కూడా నేను చదవలేదు.. కేసీఆర్ ఒక్కడే ఉద్యమం చేశాడు అంటే పొరపాటు.. ప్రజలకి సంబంధం లేదని చెప్పాలని అనుకుంటుంటే తప్పు.. ప్రజలు ఆయనకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్తారు.. తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలు త్యాగం చేశారు.

## ఐదోసారి సీఎం.. అవుతారా

హోదాల్లో విద్యార్థి నేతగా సేవలందించారు. అనంతరం 1990లో బుధ్ని నియోజకవర్గం నుంచి తొలిసారిగా శివరాజ్ సింగ్ చౌహాన్ అసెంబ్లీకి తొలిసారిగా ఎన్నికలయ్యారు. అదే సంవత్సరం విదిశ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అలా శివరాజ్ సింగ్ బీజేపీలో క్రియాశీలక రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. అనంతరం 2005లో తొలిసారిగా బీజేపీ తరపున శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అలా వరుసగా మూడుసార్లు సీఎం పీఠాన్ని శివరాజ్ సింగ్ అధిష్టించారు. అయితే 2018 ఎన్నికల్లో తొలిసారిగా మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పూర్తిస్థాయి మెజారిటీని సాధించలేకపోయింది. దీంతో అక్కడ కమలనాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అప్పటికే సీఎం కమలనాథ్, ఎంపీ జ్యోతిరాదిత్య సింధియాకు మధ్య తీవ్ర విబేధాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఏడాది తిరగకముందే జ్యోతిరాదిత్య సింధియా బీజేపీలోకి తన అనుచర ఎమ్మెల్యేలను తీసుకుని జంప్ అయ్యారు. దీంతో మరోసారి బీజేపీ నేతృత్వంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు.ఇంతవరకు బాగానే ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇరు పార్టీలు తిరిగి అధికారం చేజిక్కుంచుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే శివరాజ్ సింగ్ చౌహాన్ ఐదోసారి సీఎం పీఠంపై కన్నేశారు. అందుకోసం అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేవలం జాతీయ నేతల ఇమేజ్పై ఆధారపడకుండా రాష్ట్రంలో సొంత ఇమేజ్తో శివరాజ్ సింగ్ మధ్యప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఏదీఏమైనప్పటికీ మధ్యప్రదేశ్లో శివరాజ్ సింగ్ చౌహాన్ ఐదోసారి సీఎం పదవి చేపడతారా..? లేదా..? అన్నదాని కోసం వేచిచూడాల్సిందే.

*కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్*

# అన్నకు జై.. నాయకునికి సై.. అంటూ ఇంకెన్నాళ్లు!?

**రాజకీయ నాయకులపై నిరసనలు ఆరోపణలు అభియోగాలు అవినీతి భూకబ్జాలు ఇవన్నీ ఆయా రాజకీయ పార్టీల నేతలకు అంటురోగల్లాగా ఉన్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ వీటిని ఎజెండాగా పెట్టుకొని పొత్తులకు కాలు దువ్వుతున్న ఆయా రాజకీయ పార్టీలు ఆలోచించాల్సిందే ఏంటి!? అనేది ఇప్పుడు ఏ నలుగురు ఇద్దరు కూడుకున్న ఇదే చర్చ ఉత్పన్నమవుతుంది..**



**అన్నకు జై నాయకునికి సై అంటూ ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు! అందుకే 'జయభేరి' మోగించిన శ్రీ శ్రీ మహాకవి నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అని పలికిన ఆ మాటలను ఈ సమాజం ఈ యువత చదివి ఆలోచించి మేల్కోవాలి... నా గొడవకు శ్రీకారం చుట్టిన కాళోజీ నారాయణరావు ఆత్మఘోషను అర్థం చేసుకోవాలి... కోటి రత్నాల వీణ నా తెలంగాణ అన్న అక్షరాలను నిజం చేయడానికి సరైన పరిపాలకులను ఎన్నుకోవాలి...**


✍ జయభేరి, హైదరాబాద్ :

నిజానికి అధికార పార్టీ అవినీతిని ఆగడాలని ఎండబెట్టడానికి ప్రతిపక్ష పార్టీ స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అందరినీ కలుపుకుపోవాలి అనే అనుకొని అడుగులు వేస్తూ వస్తోంది.. ఇక ఇదే కోవలో బిజెపి పార్టీ కూడా అదే తోవన నడుస్తోంది... ఒకప్పుడు ఇదే టిఆర్ఎస్ పార్టీ టిడిపిలో ఉన్న వాళ్లందరినీ అటు కాంగ్రెస్ లో ఉన్న వాళ్ళందరినీ తన ఖాతాలో వేసుకొని తానేదో ఘనకార్యం సాధించినట్లుగా తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ద్రోహులకి క్యాబినెట్ హోదా కల్పించి సంకలు గుద్దుకుంది ఇది తెలంగాణ జనం మరిచిపోతార!?

**ఆనాడు తెలంగాణ వద్దు అని గొంతెత్తి గర్జించిన వాళ్లే కేసీఆర్ పై ఆరోపణలు చేసిన వాళ్లే ఈరోజున ఆయన పంచన చేరి బానిసలుగా మారటం లేదా!?**

ఇక్కడ మనం ఆలోచించాల్సిన విషయం ఏంటంటే ఒక్క కేసీఆర్ ని పడగొట్టడానికి ముఖ్యమంత్రి సీటు నుండి తప్పించడానికి ఎవరెవరితో పోతులు పెట్టుకుంటున్నాం ఎవరెవరితో అడుగులు వేస్తున్నాం అనేది ఒకసారి ఆయా రాజకీయ పార్టీలు ఆలోచించకపోయినా ఓట్లు వేసే జనం మాత్రం తప్పకుండా ఆలోచన చేయాలి... ఎందుకంటే మనం ఎవరికి ఓటు వేస్తున్నామో కాస్త తెలుసుకొని ఓటు వేస్తే ఏర్పడే ప్రభుత్వాలు పాలన సరిగ్గా చేస్తాయి... అలా కాకుండా నేటి రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయి కరెన్సీ కట్టలకి దాసోహం అన్నట్టుగా నడుస్తూ వస్తుంది... ఇప్పటికే ఎలక్షన్ తేదీ దగ్గర పడుతుండడంతో ఒక్కరోజులో ఒక్క ఎమ్మెల్యే రెండు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నట్టుగా సమాచారం...

**ఇదే గనక నిజమైతే ఎలక్షన్ తరువాత తెలంగాణ ప్రజల పరిస్థితి ఏంటి!? మునుగోడు ఉప ఎన్నికల్లో మునుగోడు ప్రజలను తాగుబోతులుగా చేసిన ఘనత ఎవరికి దక్కుతుంది!? దానివల్ల సాధించిన విజయం ఏంటి ఆ విజయం ప్రజలకు ఏ మేరకు మేలు చేసింది!? అనే విషయాలు మాత్రం ఎవ్వరు ఆలోచించరు కనీసం వాటి గురించి మాట్లాడుకోరు.. నిజానికి ప్రతి ఎన్నికల శంఖరావన్లో సీఎం కేసీఆర్ ఒకటే మాట పదేపదే చెబుతూ వస్తున్నారు అదేంటంటే ఓటు వేసే**



**నాయకుని వెనకాల ఏ చరిత్ర ఉందో తెలుసుకోండి అని ఏ నాయకుడు ఉన్నారు ఆలోచించండి అని... నిజమే ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టుగా మనం ఓటు వేసే ఫలానా ఎమ్మెల్యే వెనుక ఏ రాజకీయ పార్టీ ఉంది దాని పుట్టుక ఏంటి!? ఆ పార్టీ అధ్యక్షుడు ఎవరు ఆయన గత చరిత్ర ఏంటి అని ఒక్కసారి మనం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అవునంటారా !?కాదంటారా!?**

అలాంటప్పుడు మనం ఓటు వేసి ఫలానా ఎమ్మెల్యే అభ్యర్థి వెనకాల ఏ నాయకుడు ఉన్నాడు ఆయన చరిత్ర ఏంటి అనేది చెప్పకనే తెలంగాణ ప్రజలకు ఇప్పటికే పూర్తిగా అర్థమయిపోయింది... అందుకనే తెలంగాణ ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నారు అనేది సూటిగా కనిపిస్తోంది... మార్పు రావాలి ఎవరిలో రావాలి మార్పు నాయకుల్లో రావాలా? ఓటు వేసే ఓటర్లకు మార్పు రావాలా? ఇదే అసలు సమస్యగా కనిపిస్తోంది ఓటు వేసే ఓటర్లు ఒక్కసారి తమ ఆలోచనలకు పదును పెట్టి సరైన నాయకుడికి ఓటు వేయాలి. గత ఎన్నికల్లో ఒక్కసారి మనం వెనక్కి తిరిగి చూస్తే అన్ని నియోజకవర్గాల్లో నోటాకి ఎక్కువ ఓట్లు పడ్డట్టుగా మనకు అర్థమవుతుంది. నోటాకే నేటి యువత ఓటు వేస్తూ వస్తుండడం దేనికి సంకేతం!? అంటే యువత ఆలోచనల్లో నేటి రాజకీయ నాయకుల పై స్పష్టమైన అవగాహన ఉంది అనేది నగ్నసత్యం... అందుకే చదువుకున్న యువత నిరుద్యోగ యువత నోటా కి ఓటును వేస్తూ వస్తున్నారు.. కనీసం ఎలక్షన్ కమిషన్ ఒక్కసారి కూడా నోటా కి ఇన్ని ఓట్లు వచ్చాయి అని చెప్పిన దాఖలాలు ఎక్కడా లేవు. మీడియా బాధ్యత గల వారధి కాబట్టి మీడియాలో వార్త కథనాల ద్వారా ప్రత్యక్ష కథనాల ద్వారా చెబుతూ వస్తూ ఉన్న వినేవారు చదివేవారు మనలో ఎంతమంది ఉన్నారు... అందుకే 2014 ఎలక్షన్ లో ఏం జరిగిందో మనం చూసాం 2018 ఎలక్షన్ లో ఏం జరిగిందో మనం చూశాం. ఈసారి 2023 ఎన్నికల్లో కనీసం ఏం చేస్తున్నాం ఎవరికి ఓటేస్తున్నాం! అని ఆలోచించకపోతే తెలంగాణ సమాజం ఎప్పుడు బాగుపడుతుంది? ఎవరు బాగు చేస్తారు? ఎలా ముందుకు నడుస్తోంది? ఈసారి ఎన్నికల్లో కేసీఆర్ను గద్దె దించడం కాదు చెడుపై మంచి విజయం సాధించిందని మనం అనేక పండుగలను పర్వదినాలను జరుపుకొని సంతోషాన్ని ఆనందాన్ని పంచుకుంటాం అలాగే రాబోయే ఎన్నికల్లో కనీసం మనం ఓటు ఎవరికి వేస్తున్నామనే ఆలోచనతో వివేకం కలిగి ఆ ఆయుధాన్ని సామాజిక అస్త్రంగా వినియోగించుకోవాలి...

**ప్రతి ఎలక్షన్లో నాయకులు కాదు గెలిచేది ప్రజలే గెలవాలి అని చెబుతున్న ఈ నాయకులకు సరైన గుణపాఠం చెప్పాలి అని అంటే చదువుకున్న యువత ముందుకు రావాలి ఆలోచించాలి ఆచరణాత్మకంగా అడుగులు వేయాలి... మనం ఓటు వేసే ఎమ్మెల్యే అభ్యర్థి వెనక ఏ పార్టీ ఉంది ఏ నాయకుడు ఉన్నాడు వాళ్ల చరిత్ర ఏంటి అని ఒక్కసారి ఆలోచించాలి. సాక్షాత్తు ఇది మన ముఖ్యమంత్రి మనకు చెప్పిన విషయమే.... అందుకనే ఈసారి ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల పద్ధతిని వాళ్ళు ఇచ్చే పథకాలని అధికార పార్టీ ఇచ్చే సంక్షేమ పథకాలని తమ మేనిఫెస్టోలో పెడుతున్న విషయాలని ఒక్కసారి యువత చదవాలి... అవి ఎంతవరకు**

**ఇచ్చిన హామీలు అమలవుతాయో లెక్కలు వేసుకోవాలి..**

తెలంగాణ రాష్ట్రం సాధించుకుంది ఇలాంటి రాజకీయ నాయకులు ఊసరవెల్లుల మారి అధికారం చలాయిస్తూ కోట్లకు కోట్లు సంపాదన కోసం కాదు... కేవలం విద్యార్థులు వారి భవిష్యత్తు ఉపాధి అవకాశాలు రైతన్నలకు అండదండగా ఉంటూ బంగారు తెలంగాణగా ఏర్పాటు చేసుకోవాలని కలలుగన్న విద్యార్థి లోకానికి ఈ సమాజం ఏం సమాధానం ఇస్తుంది... 100 నోటుకు బీరు బాటిల్ కు బిర్యానీకు ఆశపడి 500 నోటుకు అత్యాశపడితే ఐదు సంవత్సరాలని జీవిత కాలనీ పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకునే అవకాశవాద రాజకీయ నాయకుల చెరలో నుండి బయటపడాలి... చదువుకున్న యువత మీదనే ఆ బాధ్యత పూర్తిగా ఉంది... తెలంగాణ రాష్ట్రంలో ఈసారి నూతనంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వారిలో మహిళలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కచ్చితంగా మహిళలు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి... మనకు కావలసింది నాయకులు కాదు మనకు కావలసింది మనల్ని సక్రమంగా పరిపాలించే ప్రజాస్వామ్య పరిపాలకులు కావాలి... అంతేకానీ అన్నకు జై నాయకునికి సై అంటూ ఇంకెన్నాళ్లు ఈ బానిస బతుకులు! అందుకే జయభేరిని మోగించిన శ్రీ శ్రీ మహాకవి నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అని పలికిన ఆ మాటలను ఈ సమాజం ఈ యువత చదివి ఆలోచించి మేల్కోవాలి..... నా గొడవకు శ్రీకారం చుట్టిన కాళోజీ నారాయణరావు ఆత్మఘోషను అర్థం చేసుకోవాలి... కోటి రత్నాల వీణ నా తెలంగాణ అన్న అక్షరాలను నిజం చేయడానికి సరైన పరిపాలకులను ఎన్నుకోవాలి... రాజకీయాల్లో అధికార పార్టీని ఓడించడమే కాదు అవినీతిని అక్రమాలను భూకబ్జాలను సహజ వనరుల దోపిడీని ఉపాధి అవకాశాలను అన్నింటిని మనకు కాకుండా చేసే నాయకుల దుర్బుద్ధిపై దెబ్బ కొట్టాలి... అందుకు మన ఓటే సరైన ఆయుధం... మీకు ఓటు అనే పదునైన ఆయుధాన్ని ఇచ్చాను సద్వినియోగం చేసుకుంటారు అమ్ముకుంటారు అని చెప్పిన డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ మాటలను ఈనాటి యువకులు మహిళలు అర్థం చేసుకోవాలి.... అందుకే యువతరమా ఈ దేశాన్ని ఏలుకో అన్న స్వామి వివేకానంద సూక్తిని మరొక్కసారి జ్ఞాపకం చేస్తూ....



...✍ కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

▶▶ మొదటిపేజీ తరువాయి

## మౌత్ పబ్లిసీటి భయంలో గులాబీ



పరిస్థితి. ప్రధానంగా బీఆర్ఎస్ అధినేత ఇంచుమించు ప్రతి రోజూ మూడు బహిరంగ సభలలో ప్రసంగిస్తుండటంతో ప్రింట్ మీడియాలో కానీ, ఎలక్ట్రానిక్ మీడియాలో కానీ.. ఆయన ప్రసంగానికి సంబంధించిన వార్తే హైలైట్ అవుతోంది. ఇతర పార్టీల ప్రచార కార్యక్రమాలకు కేటాయించే సమయం, స్థలం కూడా తక్కువ అయిపోతోంది. ఈ పరిస్థితుల్లో గ్రౌండ్ రియాలటీపై వాస్తవాలు జనాలకు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే తెలుస్తున్నదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక ఎన్నికల వ్యూహకర్తగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే కూడా వివిధ రాజకీయ పార్టీల తరఫున ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన సందర్భాలలో మీడియాలో ప్రచారం కంటే మౌత్ పబ్లిసిటీకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు చెబుతారు. మీడియా కంటే మౌత్ పబ్లిసిటీ చాలా బలంగా ప్రజలలోకి వెడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేసేవారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన ఏపీలో వైసీపీ తరఫున పని చేసిన సంగతి విదితమే. అప్పట్లో పింక్ డైమండ్ మాయం, వివేకా హత్య, కోడికత్తి దాడి వంటి అంశాలను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో ఆయన మీడియా కంటే మౌత్ టాక్ ద్వారా వచ్చే ప్రచారంపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. అప్పట్లో అది సత్ఫలితాలను ఇచ్చింది కూడా. ఇక ప్రస్తుతానికి వస్తే తెలంగాణలో వాస్తవ ప్రజాభిప్రాయం అంతా మౌత్ టాక్ ద్వారానే వెలుగులోనికి వస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక మాధ్యమం, మౌత్ టాక్ విపక్షాలకు ఒకింత మేలు చేస్తున్నాయనీ, అదే సమయంలో ఎలక్ట్రానిక్ మీడియాలో సింహ బాగం అధికార పార్టీ వార్తల ప్రసారం, ప్రచారానికే పరిమితమైందన్న అభిప్రాయం బలంగా ఉందని చెబుతున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, జనం తరచుగా వెళ్లే బార్బర్ షాపులు, టీ స్టాల్స్, సామాన్యులు ప్రయాణించే సిటీ బస్సులు, మెట్రో రైళ్ల ద్వారా జనాభిప్రాయం ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తూ ఒక బలమైన మాధ్యమంగా మౌత్ టాక్ మారిపోయిందని అంటున్నారు. ఈఈ ప్రదేశాలలో అత్యధికంగా బీఆర్ఎస్ అవినీతి, పోలవరం ప్రాజెక్టు లోపాలు, మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు వంటి విషయాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నదనీ, అంతిమంగా ఈ చర్చ అధికార పార్టీకి వ్యతిరేక అభిప్రాయంగా బలపడుతున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# బిఎల్ఆర్ కు సంపూర్ణ మద్దతు తెలిపిన కాపు కులాల ఐక్యవేదిక

**జయభేరి, కాప్రా :**



ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ కాపు సంఘ భవనంలో, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కాపు కులాల ఐక్య వేదిక సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో 40వేల ఓటర్లు ఉన్నటువంటి కాపులు, తమ సామాజిక వర్గానికి ఒక ఫంక్షన్ హాలు ఏర్పాటు చెయ్యాలని, రాజకీయంగా తమకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ, వంగవీటి మోహనరంగా రావు స్ఫూర్తితో బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనకు సంపూర్ణ మద్దతిచ్చిన కాపులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, కెసిఆర్ కాపుల కమ్యూనిటీ హాల్ కోసం హైటెక్ సిటీలో 7ఎకరాల స్థలాన్ని కేటాయించారని గుర్తుచేశారు. కాపులకు రాజకీయంగా ప్రాధాన్యత ఉంటుందని హామీనిచ్చారు. తనకు టికెట్ రాగానే ఉప్పల్ నియోజకవర్గ అభివద్ధి కొరకు సీఎం కేసీఆర్ తో మాట్లాడి 40 కోట్ల నిధులు మంజూరు చేపించానని, ఉప్పల్ నియోజకవర్గానికి 100పడకల ఆసుపత్రి తీసుకొచ్చానన్నారు. తన దృష్టికి తీసుకొచ్చిన ఫంక్షన్ హల్ కోసం తప్పకుండా కృషి చేస్తానంటూ, ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో మొదలైన తెలంగాణ ఉద్యమంలో, కొట్లాడి సాధించిన తెలంగాణలో నీళ్లు, నిధులు నెరవేరాయంటూ, కెసిఆర్ ని మూడవసారి ముఖ్యమంత్రిని చేస్తే, పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. బండారి లక్ష్మారెడ్డి గారు సౌమ్యుడంటూ, తన బిఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి ఉచితంగా విద్య అందిస్తూనే, ఎంతో మందికి ఆపదలో ఆదుకున్నారన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాపులందరికీ అన్నివేళలా అండగా ఉండే బండారి లక్ష్మారెడ్డి గారి బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పి.పావని రెడ్డి, గొల్లూరి అంజయ్య, కాపు కుల సంఘాల పెద్దలు పరియు ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ ప్రసాద్, వి.నాగు, శ్రీనివాస్, ఏ.వి.ఆర్ దత్తు, శంకర్ బాబు, నాగన్న మధుసూదన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ లీడర్లకు భలే.. భలే

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 15 :**

పోలింగ్కు మరోపక్షం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులు దిగువ శ్రేణి నాయకులపై దృష్టిని సారించారు. సొంత పక్షానికి చెందిన వారు పక్క పార్టీల్లోకి వెళ్లకుండా చూసుకోవటంతోపాటు అవతలి పక్షాలకు చెందిన వారిని తమ వైపు తిప్పుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం సామ, దాన, దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. నాలుగు రాళ్లు సంపాదించుకోవడానికి ఇదే సువర్ణావకాశం అని భావిస్తున్న దిగువ శ్రేణి నాయకులు పలువురు తమకు ఎవరు ఎక్కువగా ముట్ట చెబితే వారికి అనుకూలంగా పని చేస్తున్నారు. ఇలా కొందరు ఇతర పార్టీల్లో ఉండి లోపాయికారిగా ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల కోసం పని చేస్తుండటం గమనార్హం.

ఈసారి అసెంబ్లీ ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతున్న విషయం తెలిసిందే. హ్యాట్రిక్ పై గురిపెట్టిన బీఆర్ఎస్ తో పాటు ఈ సారి విజయం చేజిక్కించుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు కూడా ఆయా సెగ్మెంట్లలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని అత్యధిక శాతం అసెంబ్లీ స్థానాల్లో పోటీ నువ్వా నేనా అన్నట్లుగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు ఎలాగైనా సరే గెలుపు సాధించాలని అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం అడ్డూ అదుపు లేకుండా డబ్బు, మద్యం, గిఫ్టులు పంచి పెడుతున్నారు. అదే సమయంలో దిగువ శ్రేణి నాయకులు చేజారి పోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎన్నికల సమరంలో దిగువ శ్రేణి నాయకుల పాత్ర కీలకమైందన్న విషయం అందరికీ తెలిసిందే. వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలతో పాటు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నియోజకవర్గాల ఇన్చార్జిలు తమ తమ ప్రాంతాల్లో ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నిత్యం జనాల్లోనే ఉండే నేపథ్యంలో ఓటర్లతో వీరికి ప్రత్యక్ష సంబంధాలు ఉండటమే దీనికి కారణం. సరిగ్గా ఈ కారణం వల్లే ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు వీరిపై దృష్టిని సారించారువార్డు మెంబర్లకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలు, సర్పంచులకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు రూ. 4 నుంచి రూ. 6 లక్షల ప్యాకేజీలను అభ్యర్థులు ఆఫర్ చేస్తున్నట్టుగా సమాచారం.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే ప్రత్యర్థి పార్టీలకు చెందిన దిగువ శ్రేణి నాయకులను సైతం తమ వైపు తిప్పుకోవడానికి అన్ని పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలను ముమ్మరం చేయడం. ఫోన్లలో సంప్రదింపులు జరుపుతూ తమకు సహకరిస్తే ఎన్నికల్లో గెలిచిన తరువాత మీ పనులు చేసి పెడతామని చెబుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇదిలా ఉండగా తమతో బేరసారాలు మాట్లాడడానికి వస్తున్న వారిలో కొందరు దిగువ శ్రేణి నాయకులు మీకు అనుకూలంగా పని చేసేది లేదని తేల్చి చెబుతున్నట్టు సమాచారం. నమ్మిన పార్టీకి ద్రోహం చేయలేమని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. ఇలాంటివారిని కొందరు అభ్యర్థులు బెదిరిస్తున్నట్టుగా తెలియవచ్చింది. ముఖ్యంగా మరోసారి గెలుపు మాదే అన్న ధీమాతో ఉన్న అభ్యర్థులు 'ఎన్నికల్లో మీవాడు ఎలాగూ గెలవడు.. గెలిచేది మేమే.. ఆ తర్వాత మీ సంగతి చూస్తా' అంటూ హెచ్చరిస్తున్నట్టుగా సమాచారం. అభ్యర్థులు పోటీ పడుతూ ప్యాకేజీలతో ముందుకు వస్తున్న నేపథ్యంలో కొందరు దిగువ శ్రేణి నాయకులు తమ వద్దకు వస్తున్న వారిలో ఎవరు ఎక్కువ మొత్తంలో ప్యాకేజీ ఇస్తే వారికే అనుకూలంగా పని చేస్తామని చెబుతున్నట్లు తెలిసింది. ఇలాంటి వారికి అభ్యర్థులు అడ్వాన్సులుగా కొంత నగదును కూడా చెల్లిస్తున్నట్టు సమాచారం. రసవత్తరంగా సాగుతున్న ఎన్నికల పోరులో విజయం కోసం అభ్యర్థులు అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రజా తీర్పు ఎవరి వైపు ఉండనున్నదన్న విషయం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# బండారి లక్ష్మారెడ్డి కి మా సంపూర్ణ మద్దతు

**జయభేరి, నాచారం :**



నాచారం డివిజన్, బిఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు సాయి జెన్ శేఖర్ ఆధ్వర్యంలో శ్రీ సాయి నగర్ సాయి వెల్ఫేర్ అసోసియేషన్ వారు, బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని ఉప్పల్ నియోజకవర్గంలో అత్యంత భారీ మెజారిటీతో గెలుపిస్తామంటూ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ కాలనీలలో ఉన్న పలు సమస్యలతో కూడిన వినతపత్రాన్ని బండారి లక్ష్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనకు టికెట్ రాగానే ఉప్పల్ నియోజకవర్గ అభివద్ధి కొరకు సీఎం కేసీఆర్ తో మాట్లాడి 50 కోట్ల నిధులు మంజూరు చేపించానని, ఎన్నికల తర్వాత టెండర్ పిలిచి ఆ పనులు మొదలు పెడతామని తెలిపారు. మీరు ఆరోగ్య సమస్యతో గాంధీ, ఉస్మానియాకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉప్పల్ నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి తీసుకొచ్చానన్నారు. మీ సమస్యలన్నీ పరిష్కారం అవ్వాలంటే ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపిస్తే, ఎమ్మేల్యే హోదాలో అధికారులని తన వెంటే తీసుకొచ్చి కాలనీలోని సమస్యలన్నీ దగ్గరుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



# అధికారం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

**జయభేరి, ఉప్పల్ :**



హబ్సిగుడ డివిజన్, కాకతీయ నగర్ నుండి ప్రారంభించి పి.ఎన్.టి కాలనీ, మీదుగా జెట్ స్పీడ్ తో దూసుకుపోతూ జోరుగా ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి, బిఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్, బిఎల్అర్ ఫోటోల జెండాలతో మరోపక్క మహిళా సోదరీమణులు బొట్టు పెట్టి, మంగళ హరతులిస్తూ ఘనంగా స్వాగతం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా బండారి లక్ష్మారెడ్డి గారు బిఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కాలనీ ప్రజలు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం ఇక్కడ నడవడానికి దారి కూడా సరిగ్గాలేని పరిస్థితి ఉండేదని, తానే స్వయంగా వచ్చి పరిశీలించి రోడ్డు మరమత్తులు చేయించానని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు కేసిఆర్ 50కోట్ల నిధులు మంజూరు చేశారని, ఎన్నికల తర్వాత వాటి పనులు మొదలవుతాయన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ బిఅర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజార్టీతో గెలిపిస్తే, మీ ఎమ్మేల్యే గా సంబంధిత అధికారులను తీసుకొచ్చి దగ్గరుండి మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



# బీఆర్ఎస్ సంక్షేమ పథకాలే రేపు గెలుపుకు నాంది

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ మండలంలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన సుమారు 40 మంది శివాజీ యూత్ సభ్యులు గురువారం మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చామకూర మహేందర్ రెడ్డి సమక్షంలో, మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీర్లపల్లి భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో మేడ్చల్ అభివృద్ధి జరిగిందని గ్రామాభివృద్ధి జరిగిందంటే అది మంత్రి మల్లారెడ్డి చొరవతో అభివృద్ధి సాధ్యమైందని కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి కార్యక్రమాలను తొమ్మిదిన్నర సంవత్సరాలుగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 30వ తేదీన కారు గుర్తుకు ఓటేసి మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మహేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయానంద్ యాదవ్, జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అమ్మగారి విజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి రాజమల్లారెడ్డి, డబిల్ పూర్ పిఏసిఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బలరాం రెడ్డి, రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ గుంటి శేఖర్, గ్రామ అధ్యక్షులు గుంటి దీపక్, సీనియర్ నాయకులు గుంటి కుమార్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బోడుప్పల్ ప్రజల మద్దతు బిఆర్ఎస్ కే

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్లో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఐదుగురు కార్పొరేటర్లు సొంత ప్రయోజనాల కోసం, ప్రలోభాలకు లొంగి కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఐదుగురిలో ముగ్గురు బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ లని, ఒకరు కాంగ్రెస్ పార్టీ నుండి మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన వారిని, కేవలం వ్యక్తులు మాత్రమే కాంగ్రెసులోకి వెళ్లారని, వారి వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని, ఆయా డివిజన్లోని బిఆర్ఎస్ క్యాడర్ పటిష్టంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, చేసిన మల్లారెడ్డి విజయాన్ని అడ్డుకోలేరని, బోడుప్పల్ గడ్డ బిఆర్ఎస్ అడ్డా అని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా కెసిఆర్ ఫోటోతో కారు గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లు పార్టీ నుండి అనేక ప్రయోజనాలు పొందారని, నైతికత లేని నాయకులు పార్టీలో ఉన్నా లేకున్నా ఒకటేనని, ప్రజలు విజ్ఞానవంతులని బోడుప్పల్ ప్రజల ఆశీర్వాదాలు, అండదండలు ఉద్యమ సమయం నుండి కెసిఆర్ కు బిఆర్ఎస్ కు మద్దతుగా ఉన్నాయని, ఈ ఎన్నికల్లో కూడా మంత్రి మల్లారెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించి కేసిఆర్ కు బహుమతిగా అందిస్తామని, మంద సంజీవరెడ్డి ఉద్ఘాటించారు. అదేవిధంగా పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ.. గుప్పెడు నాయకులు పోయిన వందమంది నాయకులు బిఆర్ఎస్ లో పుడతారని, కేసుల భయంతో, కులం సెంటిమెంట్తో, కాంగ్రెస్ పార్టీ ప్యాకేజీలకు లొంగి పార్టీని వీడారని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మీసాల కృష్ణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# మంత్రి మల్లారెడ్డికి మద్దతుగా కౌన్సిలర్ల ప్రచారం

**జయభేరి, మేడ్చల్ :**

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకి మరోసారి అధికారం అందిస్తుందని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు.గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో మంత్రి మల్లారెడ్డికి మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కారుగుర్తుకు ఓటు వేసి మేడ్చల్ అభ్యర్థి మల్లారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ మల్లికార్జున్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి తన సొంత ఖర్చులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల ప్రేమను గెలుచుకున్న గొప్ప నాయకుడు మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ ప్రజలు మరోసారి ఎమ్మెల్యే గా అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, నాయకులు సుంకు రమేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# 4వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార ర్యాలీ

**జయభేరి, మేడ్చల్ :**

నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డుల మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ చామకూర గోపాల్ రెడ్డి తో కలిసి స్థానిక కౌన్సిలర్ గణేష్ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తుడుం గణేష్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో విశ్రాంతి అనేది లేకుండా మేడ్చల్ నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి ప్రతి గ్రామంలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎప్పుడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే మల్లారెడ్డిని మేడ్చల్ నియోజకవర్గం నుండి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ ను మూడోసారి కూడా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ నవీన్ రెడ్డి, మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి, 4వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ నరేష్, నాయకులు ఇంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, కుమార్, పవన్, మధు గౌడ్, సాయి గౌడ్ రమేష్, మారుతి, శ్యాం, శివాజీ, అశోక్, వినయ్, నాగరాజ్, భాస్కర్, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి విజయశాంతి కాంగ్రెస్ కు గాలి అనిల్ గుడ్ బై

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. విజయశాంతి బిజెపికి గుడ్ బై చెప్పారు. గత కొంతకాలంగా ఆమె బిజెపి పై సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నాడు తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ అధ్యక్షుడు నడ్డాకు ఆమె పంపించారు. శుక్రవారం రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరనున్నారు. విజయశాంతికి మెదక్ లోక్ సభ టికెట్ కాంగ్రెస్ ఆఫర్ చేసింది. ఇదివరకే మెదక్ టికెట్ ను గాలి అనిల్ కుమార్ కు కాంగ్రెస్ చెప్పింది. నర్సాపూర్, పటాన్ చెరు అసెంబ్లీ టికెట్లను ఆశించిన గాలి అనిల్ కు.. మెదక్ లోక్ సభ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ మళ్లీ విజయశాంతికి అదే టికెట్ ను ఆఫర్ చేయడంతో.. కాంగ్రెస్ కు గాలి అనిల్ కుమార్ రాజీనామా చేసారు.

jayabheridaily.com
ప్రభాత
జయభేరి



## భగీరథ్ బాలల వికాస కేంద్రంలో వార్షికోత్సవ ఘనంగా వేడుకలు

**జయభేరి, శామీర్ పేట్, నవంబర్16:**

శామీర్ పేట్ మండలం లాల్ గడిమలక్ పేట్ గ్రామంలోని హెచ్ బీ ఎల్ సంస్థ ఆద్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన 15వ వార్షికోత్సవ వేడుకల్లో ఎ డబ్లూ సీ డీపీఓఉదయశ్రీ పాల్గొన్నారు. చిన్నారులకు హెచ్ బీ ఎల్ సంస్థ గత 15 సంవత్సరాలుగా విద్య పరంగా, శారీరకంగా, మానసికంగా ఎదుగేందుకు ఎంతా తోడ్పడుతుందని తెలిపారు. పిల్లలు ఎంతో చురుకుగా, ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ బీ ఎల్ సంస్థ ప్రతినిధి విజయలక్ష్మి, రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ డీజిఎం, రఘునాధ్, చిరంజీవి, మురళి మోహన్, కృష్ణంరాజు చిన్నారులు పాల్గొన్నారు.






## జోరుగా బీజేపీ పార్టీ ప్రచారం

**జయభేరి, మూడుచింతలపల్లి, నవంబర్16:**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవినీతి పార్టీలని, ధర్మం కోసం పనిచేసే పార్టీ బీజేపీ పార్టీ అని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం జగన్ గూడ, కేశవరం, నాగిశెట్టిపల్లి, ఆద్రాస్ పల్లి, ఉద్దమర్రి, కేశ్వాపూర్ గ్రామాలలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ పార్టీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే స్థానికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించడం జరుగుతుందని, ఆయుస్మాన్ భారత్ తో మంచి వైద్యం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశం, కొత్త రేషన్ కార్డులు, అందిస్తామని తెలిపారు. స్థానిక మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గ ప్రజలను మోస చేశారని మండిపడ్డారు. కండ్లకోయలో ఐటీ పార్క్ అని చెప్పి ఇంతవరకు దానికి పునాది పడలేదన్నారు. మేడ్చల్ నియోజకవర్గాన్ని కబ్జాల పాలు చేసిన ఘనత మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. ఏ గ్రామానికి వెల్లిన బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. దేశంలో సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ లాగే తెలంగాణ లో కూడా బీజేపీ అధికారంలోకి వస్తే మంచి పాలన అందిస్తామని చెప్పారు. దయచేసి ప్రతి ఒక్కరు ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, మూడుచింతలపల్లి మండల బీజేపీ అధ్యక్షులు నందాల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బుద్ధి శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నాగరాజు చారి, వెంకటేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## బోడుప్పల్ లో మల్లారెడ్డికి షాక్

- హస్తం గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక

**జయభేరి, మేడిపల్లి :**

ఎన్నికల వెళ కారు పార్టీకి షాక్ తగిలింది.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన బోడుప్పల్ కార్పోరేషన్ ఐదుగురు కార్పొరేటర్లు కారు ను వదిలి హస్తం అందుకున్నారు. గురువారం నాడు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రెష్ యాదవ్, బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డిల అధ్వర్యంలో టీ.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరిన వారిలో 23 డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, ఒకటవ డివిజన్ కార్పోరేటర్ బింగి జంగయ్య యాదవ్, 13 వ డివిజన్ కార్పోరేటర్ దానగళ్ల అనితా యాదగిరి, 20 వ డివిజన్ కార్పోరేటర్ జడిగే మహేందర్ యాదవ్, 24 వ డివిజన్ కార్పోరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ లు ఉన్నారు.



# ప్రజల సంక్షేమామే కాంగ్రెస్ లక్ష్యం

- మేడ్చల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయభేరీ సభలో రేవంత్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణలో జరిగి ఎన్నికల్లో ప్రజలు దొరల పాలనకు చరమగీతం పడబోతున్నారని టిపిసిస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేసిందే కాకుండా మళ్లీ మూడోసారి అధికారం ఇవ్వాలని కేసీఆర్ వస్తున్నాడని వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. మేడ్చల్లో మంత్రి మల్లారెడ్డి, సీఎం కేసీఆర్ భూములు కబ్జాచేశారని ఆరోపించారు. మంత్రి మల్లారెడ్డికి ప్రైవేటు కాలేజీలు పెట్టుకోవడానికి అనుమతులు ఇచ్చారు కానీ మేడ్చల్ కు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎందుకు తీసుకురాలేక పోయారని విమర్శించారు. తెలంగాణలో అన్ని వర్గాలను కేసీఆర్ మోసం చేసిందే కాకుండా కాంగ్రెస్ పార్టీపై అబద్దాలు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంతానికి ఏమి చేసిందని కేసీఆర్ అంటున్నారని హైదరాబాదు ఔటర్ రింగ్ రోడ్డు, ఐటీ కంపెనీలు, ఫార్మా కంపెనీలు, మెట్రో రైలు, విమానాశ్రయం తెచ్చింది కాంగ్రెస్ కాదా, తెలంగాణ ఇచ్చింది, హైదరాబాద్ కు కృష్ణ జలాలు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీ తెలంగాణ





రాష్ట్రం ఇవ్వకపోతే కేసీఆర్ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.ఈ ఎన్నికలు రాష్ట్రంలో దొరలకు ప్రజలకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని ప్రజల తెంగాణ రావాలంటే దొరల తెలంగాణ కూలిపోవాలన్నారు. తాము అధికారంలోకి రాగానే మేడ్చల్ లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తేవడంతో పాటు పేదలకు రూ.500 లేక సిలిండర్, ఇళ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. పేదల ఇంట్లో ఆడపిల్ల పెళ్లికి రూ. లక్ష నగదు, తులం బంగారం ఇవ్వబోతున్నట్లు హామీ ఇచ్చారు. ముదిరాజులను ఒక్క టికెట్ ఇవ్వని కేసీఆర్ కు వారి ఓట్లు అక్కర్లేదా అని నిలదీశారు. రాష్ట్రాన్ని ఆగం చేసిన కేసీఆర్ ను పొలిమేర వరకు తరమాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి,కౌన్సిలర్లు చాపరాజు, భవాని రాఘవేందర్ గౌడ్,సరితా మల్లేష్ గౌడ్, మండల అధ్యక్షుడు రమణారెడ్డి,గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, వేముల శ్రీనివాస్ రెడ్డి, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, రంజిత్ ముదిరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి మల్లారెడ్డి ఓటమి ఖాయం

**జయభేరి, మేడ్చల్ :**

మంత్రి మల్లారెడ్డి మాటలకే తప్ప మేడ్చల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ అన్నారు.గురువారం కాంగెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ కు మద్దతుగా మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ కు విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కి స్వాగతం పలికేందుకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ మేడ్చల్ ప్రజలు మంత్రి మల్లారెడ్డిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఎప్పుడెప్పుడు ఎన్నికలు జరుగుతాయా మల్లారెడ్డిని ఇంటికి పంపిచేద్దామ అని ప్రజలు వేసి చూస్తున్నారని ఆయన తెలిపారు.మల్లారెడ్డి వాగ్దానాలు ఇయ్యడానికే తప్ప చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి వజ్రేష్ యాదవ్ కు మద్దతుగా ఉన్నారని చెప్పడానికి మీటింగ్ లో వచ్చిన ప్రజాలను చుస్తే స్పష్టం అవుతుందన్నారు.30వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ కు మద్దతుగా హస్తం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ ముదిరాజ్,నవీన్ ముదిరాజ్,బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## మల్లారెడ్డికి మద్దతుగా కౌన్సిలర్ కౌడే మహేష్ ప్రచారం

**జయభేరి, మేడ్చల్ :**

వచ్చే ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగరాడం ఖాయమని మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ అన్నారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి మద్దతుగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు తరపునుండి కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ,పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రచారంలో భాగంగా వార్డు పరిధిలోని గొల్ల బస్తీ,వంజరి బస్తీ,కురుమ బస్తీ,ముస్లిం బస్తీ,స్టేషన్ రోడ్డు,రైతు బజార్,మటన్ మార్కెట్ పలు బస్తీలలో ఇంటింటికి వెళ్లి కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని పేదలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ కి శ్రీరామ రక్ష అని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ తొమ్మిది ఏండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించినట్లు మహేష్ తెలిపారు. పాదయాత్ర చేస్తూ ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారని, సీఎం కేసీఆర్ అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులను ప్రజలు మరిచిపోలేదని, ఎక్కడ వెళ్లిన ఆసరా పెన్షన్,కల్యాణ లక్ష్మీ వాటి గురించే మాట్లాడుతున్నారని అన్నారు.రాష్ట్రంలో మరోసారి బిఆర్ఎస్ సర్కారు ఏర్పాటు ఖాయమని మహేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శైలేందర్ వంజరి, మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి పెంజర్ల భాస్కర్ యాదవ్, మేడ్చల్ పట్టణ మాజీ వార్డు మెంబర్ కౌడే నాగేందర్ కురుమ, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఒగ్గు శంకర్ కురుమ, మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కౌడే వెంకటేష్ కురుమ, 23వ వార్డు బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కౌడే శ్రీశైలం కురుమ,23వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉద్దెమర్రి రాజు ముదిరాజ్, మొలంగిరి విజయ్ కుమార్ చారి, పెంజర్ల సాయి యాదవ్, కుశ్వంత్ సింగ్, శేఖర్ రెడ్డి,ధృవరాజ్ ముదిరాజ్, బబ్లూ,కౌడే సాయి, చింటు, నాగరాజు, సుప్రీత్, అజయ్, అర్శద్, సాయి, నీలిమ, పద్మ, వరలక్ష్మి, శారద, వసంత తదితరులు పాల్గొన్నారు.






## కారు గుర్తుకే మన ఓటు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ 25వ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సాయి హిల్స్ కాలనీ వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదా సభకు విచ్చిసిన మేడ్చల్ MLA అభ్యర్థి చమకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరిస్తూ కార్ గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీ తో గెలిపించాలని, అలాగే కేసీఆర్ ని మూడవ సారి ముఖ్యమంత్రి చేయడానికి మీరందరూ కార్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్ధించారు. 25వ డివిజన్ ప్రజా ఆశీర్వాదా సభలో సాయి హిల్స్ కాలనీ వాసులు ఏకగ్రీవంగా కార్ గుర్తుకు ఓటు వేస్తామని లిఖితపూర్వకంగా వ్రాసిఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు, యువతీయువకులు, కాలనీ వాసులు పెద్దఎత్తున పాల్గొని సభను విజయవంతం చేశారు.





## బిజెపి, బిఆర్ఎస్ నాయకులు పుచ్చుకున్న కాంగ్రెస్ తీర్థం

**జయభేరి, మేడిపల్లి :**

పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని మేడిపల్లిలో మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యక్షులు తుంగతుర్తి రవి, ప్రధాన కార్యదర్శి శ్రీ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి, బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. మేడిపల్లి మాజీ ఎంపీటీసీ తుళ్ల బిక్షపతి గౌడ్, మెట్టు నాగయ్య, తుళ్ల యాదయ్య, పంగ నరసింహ, కొర్రెముల అంజయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, సైదులు, యూత్ నాయకులు మెట్టు అనిల్, స్వామి, మల్లేష్, నిఖిల్, ప్రశాంత్, మరియు 50 మంది మహిళలతో సుమారు 200 మంది, మేడిపల్లి ఆటో యూనియన్ అధ్యక్షులు ఎండి అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. రహీం, సతీష్, నరేష్, లాయక్, ఖాదర్, పవన్, శివ, యాదగిరి, నరసింహ, కృష్ణ, సైదులు, కుమార్, బాబు, రాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.





## 18 మద్యం డిస్టిలరీలపై నిఘా

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 16 :**

తెలంగాణలో ఎన్నికలు ఇంకొద్ది రోజులే ఉన్నందున ముఖ్యమైన తాయిలాల్లో ఒకటైన మద్యం పంపకాలపై ఎన్నికల సంఘం ఫోకస్ చేసింది. తాజాగా ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రకారం తెలంగాణలోని 18 మద్యం డిస్టిలరీలపై నిఘా పెట్టినట్లుగా ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ సురేశ్ తెలిపారు. ఇందుకోసం మొత్తం 10 టీమ్ లను ఏర్పాటు చేసి.. ఒక్కో టీమ్ కి ఎక్సైజ్ సూపరింటెండెంట్ను ఇన్చార్జిగా నియమించినట్లు సురేశ్ తెలిపారు. రాష్ట్రంలోని 18 డిస్టిలరీలను అధికారుల టీమ్స్ ఆకస్మికంగా తనిఖీ చేశాయని, లిక్కర్ ఉత్పత్తి, సప్లై, సంబంధింత రిజిస్టర్లను పరిశీలించినట్లు చెప్పారు. రికార్డులన్నీ సక్రమంగాగానే ఉన్నాయని, అధికారుల పరిశీలనలో తేలిందని సురేశ్ వెల్లడించారు. మద్యం డిస్టిలరీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎక్సైజ్ శాఖ హెడ్ ఆఫీస్ కు కనెక్ట్ చేసినట్లుగా ఆయన వెల్లడించారు. నిరంతరం సీసీటీవీ కెమెరాలను పరిశీలించడం సహా.. మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టినట్లుగా జాయింట్ కమిషనర్ సురేశ్ వెల్లడించారు.మరోవైపు, ఎన్నికల ప్రవర్తన నియమావళిలోభాగంగా ఇప్పటి వరకు రూ.53,18,37,638 విలువ గల నగదు సీజ్ చేసినట్లుగా అధికారులు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా ఎఫ్.ఎస్.టి, పోలీస్, ఎక్సైజ్, ఎస్.ఎస్.టి అధికారులు ఏర్పాటు చేసిన 18 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల వద్ద ఈ మొత్తం విలువ గల నగదు, బంగారం తదితర సామాగ్రిని సీజ్ చేశారు. ఇందులో రూ.21,82,79,365 నగదు ఉండగా ఇతర విలువైన వస్తువులు 31,35,58,273 విలువగలవి ఉన్నాయి. ఇందులో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ల ద్వారా రూ.3,57,32,450 నగదు, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. ఎస్.ఎస్.టీ టీమ్ ల ద్వారా రూ.14,52,000 నగదు, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. పోలీస్ అధికారుల ద్వారా రూ.49,46,53,188 విలువైన నగదు, ఇతర సామాగ్రిని సీజ్ చేశారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ లు సంయుక్తంగా రూ.3,56,34,955 విలువ గల 64,964 లీటర్ల లిక్కర్ ను సీజ్ 711 కేసులు బుక్ చేసి 502 మందిని అరెస్ట్ చేశారు. 23,28,16,464 రూపాయల విలువ గల 447 కేజీల మెటల్స్ బంగారం, సిల్వర్ ఇతర వస్తువులను సీజ్ చేశారు. ఎన్.డి.పి.ఎస్ కింద 3,29,92,521 రూపాయల విలువ గల 1262 కిలోల గంజాయి, డ్రగ్స్ ను సీజ్ చేశారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి


# మనకు పాలించుకునే హక్కు లేదా..?

- బహుజన రాజ్యాధికారం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం
- మక్తా కొత్తగూడెం నుంచి 300 మంది కార్యకర్తలు చేరిక
- తుంగతుర్తి దొరలను దొర గడీలకే పంపాలి మీ బిడ్డ జానయ్యను అసెంబ్లీకి పంపాలి
- బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

అగ్రకుల నాయకులే పాలించాలా.. మనకు పాలించుకునే హక్కు లేదా.., బహుజన రాజ్యాధికారి కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమని బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆత్మకూరు (s) మండలం బోడ తండా, మక్తా కొత్తగూడెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినడానికి కూడా తిండి లేని పరిస్థితి నుంచి వచ్చానని, సామాన్య ప్రజల సాధక బాధలు ఏంటో నాకు తెలుసు అని అన్నారు. సామాన్య ప్రజల అభివృద్ధికి పాటు పడతానని, అందుకు ఒక





అవకాశం ఇవ్వాలని కోరారు. లక్షల మంది విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకొని పరీక్షలకు ప్రిపేర్ అయితే ప్రభుత్వ వైఫల్యం వలన పేపర్ లీకేజ్ తో విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత మానసికంగా ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటే ప్రేమ పేరుతో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆరోపించారని అన్నారు. బహుజనుల అభివృద్ధి కోసం గత మూడు నెలలుగా కంటిమీద కునుకు లేకుండా, కడుపుకు తిండి లేకుండా పోరాటం చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మన భవిష్యత్ తరాల బతుకు మారాలంటే ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మక్తా కొత్తగూడెం నుంచి గుండాల (ఎల్ఐసి) లింగయ్య, వార్డు సభ్యురాలు పరాల సుజాత, ఉప్పల గణేష్, పరాల ప్రవీణ్, గుండాల నవీన్, ఏర్పుల గంగరాజులతోపాటు గుండాల రాకేష్, గుండాల వెంకన్న, ఏడు కొండలు, మల్లయ్య, సైదులు, వెంకన్న, అవిలయ్య, ఉప్పయ్య, గురువయ్య, గంగమల్లు, మహేష్, వెంకన్న, లింగయ్య, శ్రీను, మల్లయ్య, పద్మ, మౌనిక తో పాటు 300 మంది కార్యకర్తలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకి రాజీనామా చేసి బిఎస్పి పార్టీలో చేరారు. బోడతండా నుంచి బోడ జయరాజు, బాలరాజు, రామ్ కుమార్, కిషన్, వాంకుడోత్ శంకర్, దాసు, శివ, బోడ విజయ్, వాంకుడోత్ బావు సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాతర్లపాదు సర్పంచ్ కేశబోయిన మల్లయ్య, తుమ్మల పెన్ పహాడ్ ఎంపీటీసీ ఉప్పుల మల్లయ్య, బీసీ లింగయ్య, దేవలింగం తదితరులు పాల్గొన్నారు.



## ఏనుగు గుర్తును చూపుతూ ఇంటింటికి ప్రచారం

**జయభేరి, సూర్యాపేట :**

బహుజన సమాజ్ పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గెలుపు కోసం ఏనుగు గుర్తును చూపుతూ యండ్లపల్లి గ్రామంలో ఇంటింటికి ప్రచారం కొనసాగిస్తున్న BSP పార్టీ గ్రామ ఇంచార్జ్ ఇంద్రకంటి శంకర్, ప్రచారంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన వట్టే రేణుక జానయ్య యాదవ్ విచ్చేసి గడపగడపకు ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించగలరని ప్రచారం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాటిపాముల సంధ్యారాణి, ముండ్ల కృష్ణయ్య,ఉప్పుల కృష్ణ, జటంగి రామకృష్ణ, బోర్రాజు చిన్నసైదులు, జటంగి సాయి, బొడ్డు వెంకటేష్, పగిడి శివ, జటంగి జానయ్య, గుండెబోయిన శ్రీను, గుండెబోయిన సతీష్, జటంగి గంగయ్య, జటంగి జానయ్య, రాగం లింగయ్య, పెరమళ్ళ మధు మరియు తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

**జయభేరి, సూర్యాపేట :**

కుప్పిరెడ్డి గూడెం 10 వార్డు నుండి బహుజన్ సమాజ్ పార్టీలోకి భారీగా చేరికలు. బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ తనయుడు వట్టె గణేష్ యాదవ్ సమక్షంలో 200 మంది బహుజన్ సమాజ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో సూర్యాపేట గడ్డపై నీలి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యులు కనుక నవీన్ BSP గ్రామ శాఖ అధ్యక్షుడు, కొలిపెల్లి శ్రీను, చెరుకుపల్లి నరేష్, ఆదిమల్ల వెంకటేష్ (అర్జున్ రెడ్డి) చెరుకు నరేష్, కనుక కళ్యాణ్, కనుక పవన్, చెడిపల్లి అజయ్, శ్రీను, అబ్రహాము, సామేలు, మధు, గ్రామస్తులు బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మన ఓటు మనకే వేసుకుందాం.. మన సీటుని మనమే కాపాడుకుందాం

- టీ స్టాల్ లో ముచ్చటిస్తూ.. ప్రచారం చేస్తూ
- చిరు వ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న జానన్న

**జయభేరి, సూర్యాపేట :**

గత నెల రోజులుగా బిజీ షెడ్యూల్ తో విరామం లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గురువారం పట్టణంలోని విద్యానగర్ లోని అజయ్ టీ స్టాల్ లో కాసేపు ముచ్చటించారు. టీ తాగే వాళ్లకు తానే స్వయంగా టీ చేసి అందించారు.

టీ తాగుతూ చిరు వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీ స్టాల్ యజమానితో వ్యాపార వివరాలను, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఎస్పి పార్టీ గెలిస్తే కలిగే ప్రయోజనాల గురించి అక్కడున్న వారికి తెలియజేశారు. ఆయన వెంట బీఎస్పీ పార్టీ పట్టణ ఇన్చార్జి గండూరి కృపాకర్, సూపర్ సైదులు, పార్టీ కార్యకర్తలు ప్రజలు తదితరులున్నారు.





## కుమారి మాయావతి బహిరంగ సభని జయప్రదం చేయండి

### బుడిగ మల్లేష్ యాదవ్ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి

**జయభేరి, సూర్యాపేట :**

తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు,ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్ జీ కుమారి మాయవతి గారు సూర్యాపేట, పెద్దపల్లి జిల్లాల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో భాగంగా నిర్వహించే భారీ బహిరంగ సభలు.

తేదీ: 22112023 (బుధవారం) సూర్యాపేట. ఈ సభకు ఉమ్మడి నల్గొండ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలతోపాటు రాష్ట్ర నలుమూలల నుండి నుంచి అత్యధికంగా జన సమీకరణ చేయాలని రాష్ట్ర నాయకులతోపాటు అన్ని జిల్లాలు, అసెంబ్లీల ఇంచార్జీలను, అధ్యక్షులను ఆదేశించనైనది. అదేవిధంగా ఈ యొక్క సభకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించుకొని, బహిరంగ సభలను విజయవంతం చేయగలరని అని అన్నారు.



## అభివృద్ధి ముసుగులో అవినీతి చేసిన జగదీశ్ రెడ్డి

- అవినీతికి కేరాఫ్ అడ్రస్ జగదీశ్ రెడ్డి
- సూర్యాపేట పట్టణంలో ఒక్క గుత్తేదారునికే పనులు అప్పజెప్పిన జగదీశ్ రెడ్డి
- 2014 ఎన్నికల ముందు జగదీశ్ రెడ్డి ఆస్తులెంత ఇప్పుడున్న ఆస్తులెంత చర్చకు నేను సిద్ధం
- 6 ఎకరాల్లో ఇంద్రభవనం కట్టుకున్న జగదీశ్ రెడ్డి
- ఇన్నివేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలి.
- బిఎస్పీకి పెరుగుతున్న ఆదరణ

**జయభేరి, సూర్యాపేట :**

పాత సూర్యాపేట నుంచి 100 మంది చేరిక. సూర్యాపేట నియోజకవర్గంలో బిఎస్పి పార్టీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతుంది. పాత సూర్యాపేట గ్రామానికి చెందిన 100 మంది కార్యకర్తలు టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి గురువారం బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బిఎస్పీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నారబోయిన మల్లయ్య తలకొప్పుల ఎల్లయ్య, చెరుకుపల్లి మహేష్, ఎలుగూరి మధు, బైరు బాలయ్య, కడారి మహేష్, సూరారపు కృష్ణయ్య, బైరు చరణ్, సుంకరి నాగమల్లు మల్లయ్య తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శేఖర్, ఎడవల్లి నాగేందర్, బోల్లెపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబానికి అండగా ఉంటా

## బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని మామిళ్లగడ్డ కు చెందిన నల్లమాద నరసయ్య, ఆత్మకూరు (ఎస్) మండలం కోటి నాయక్ తండ కు చెందిన సంపంగి తిరుపమ్మ ఆరోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ మృతదేహాలకు





పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని వేళల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఐలాపురం సర్పంచ్ బోడబట్ల సునీత శ్రీను మంద లింగరాజు, కుంభం వెంకన్న, కోట కృష్ణ తదితరున్నారు.



## మాజీ ఎంపిటిసి సామ మల్లారెడ్డి ని పరామర్శించిన వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

ఆత్మకూరు (ఎస్ ) మండలం పాత సూర్యాపేటకు చెందిన మాజీ ఎంపిటిసి సామ మల్లారెడ్డి భార్య సామ పద్మ గుండెపోటుతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ గారు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ఐలాపురం సర్పంచ్ బోడబట్ల సునీత శ్రీను, భారి అశోక్, తిరుమల చారి, కోట కృష్ణ, ఎడ్ల శేఖర్, మురుపాక సైదులు, మధు, నాగేంద్ర, సాయి తదితరులున్నారు.

# 29వవార్డు నుంచి భారీ చేరికలు

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి లోని 29వ వార్డుకు చెందిన 100కుటుంబలు, బీజేపీ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన రమణ, జ్యోతి, నవ్య, మౌనిక, రాములు, రాములమ్మ, శ్రీనివాస్, కీర్తన, కళ్యాణి, శ్రీను, రామ, నేహా, కుబ్రుభి రాజీనామా చేసి ఈరోజు బహుజన్ సమాజ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకొని Bsp పార్టీలో చేరారు. జనాభాలో 99% ఉన్న బహుజనులు అందరూ ఏకమై బహుజన పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి వట్టే జానయ్య యాదవ్ ని గెలిపించాలని కోరారు కార్యక్రమం లో మీర్ అక్బర్ కుంభం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.







## చిన్నారిని ఆశీర్వదించిన వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని బి బి గూడెం గ్రామానికి చెందిన దేశ బోయిన బిక్షం గంగమ్మల పుత్రిక శ్రీ తేజ నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం గురువారం బిబి గూడెంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బిఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, గండూరి రాధిక రమేష్, ఐలాపురం సర్పంచ్ బోడబట్ల సునీత శ్రీను, మాజి ఎంపిటిసి గడ్డం సైదులు, సుంకర బోయిన రాజు, దేశబోయిన సురేష్, భారీ అశోక్, జటంగి మహేష్, శరత్, లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు



మాజీ కౌన్సిలర్ టిఆర్ఎస్ నాయకులు గునగంటి వంశీదర్ కాంగ్రెస్ పార్టీ లోచెరిక

ప్రభాత జయభేరి jayabheridaily.com

# దొరల పాలన పోవాలి.. బహుజన రాజ్యం రావాలి

- వలస వాదులకు గుడ్ బై చెప్పాలి
- 2014 ఎన్నికల ముందు మంత్రి ఆస్తులు ఎంత? ఇప్పుడున్న ఆస్తులు ఎంత..? చర్చకు నేను సిద్ధం.
- అభివృద్ధి ముసుగుతో అవినీతి చేసిన మంత్రి జగదీష్ రెడ్డి
- నాగారంలో ఇంద్ర భవనం కట్టుకున్న మంత్రి
- ఎంజీ నగర్ సర్పంచ్ కమలాసింగ్ కుమారుడు రాజీవ్ ఆధ్వర్యంలో 300 మంది బిఎస్పీలో చేరిక
- గాయం వారి గూడెం నుంచి 200 మంది బిఎస్పీలో చేరిక
- మంత్రిని ఎదిరించిన మహిళల ను శాలువాతో సన్మానించిన జానన్న
- బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టే జానయ్య యాదవ్

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ఇక్కడ పాలన చేస్తున్న వలసవాదులను ఓటు రూపంలో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. గురువారం చివ్వేంల మండలం గాయం వారి గూడెం, బంగారి తండా, టీకం నాయక్ తండా, రోళ్ళ బండ తండా, ఎంజీ నగర్ తండా గ్రామాలలో మంత్రిని ఎదిరించిన మహిళలకు శాలువాతో సన్మానించి, కాళ్లకు దండం పెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరు చెబుతున్న బిఆర్ఎస్ నాయకులు తండావాసులకు ఎస్టి బందు పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మనమంతా ఏకమైతే 90 శాతం ఉన్న బహుజనులను కాదని, 10% ఉన్న నాయకులు ఎలా పాలన చేపడతారో చూడాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలంతా ఏకమై ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించుకొని అభివృద్ధి సాధించుకోవాలని కోరారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలలో ఏనుగు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నేపర్తి రాజేష్, ఐలాపురం





సర్పంచ్ బోడబట్ల సునీత శ్రీను, బీఎస్పీ నాయకులు పలస సైదులు గౌడ్, కొత్తపల్లి మల్సూర్, సట్టు నాగయ్య, శ్రావణపల్లి లలిత, వరికుప్పల కిరణ్, బోడబట్ల ప్రవీణ్ గౌడ్, జగదీష్, రాములు, శేఖర్, రత్నావత్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఎంజీ నగర్ నుంచి పార్టీలో చేరిన వారిలో సాగర్, రవి, శశిలాల్, వేణు, మోహన్, మహేష్, రాజు, ప్రవీణ్, ప్రభు, మనోహర్, రాజశేఖర్ తోపాటు 300 మంది కార్యకర్తలు బిఎస్పీలో చేరారు. రెమడాల జగదీష్, కుంచం రాములు, వలపట్ల శేఖర్ ల ఆధ్వర్యంలో గాయం వారి గూడెం నుంచి కలకోట్ల రాములు, భూక్య, మల్సూర్, చిన్న వీరయ్య, మౌనిక, శేఖర్, సుజాత, సైదులు తదితరులు పార్టీలో చేరారు.

- బిఆర్ఎస్ కు బిగ్ షాక్
- ఖాళీ అవుతున్న కారు... పెరుగుతున్న ఏనుగు బలం
- పట్టణంలో కారు టైర్ పంచర్ తో ఏనుగు ఎక్కుతున్న కౌన్సిలర్లు.
- బిఎస్పీలో చేరిన కౌన్సిలర్ అన్నేపర్తి రాజేష్
- బిఎస్పి లో చేరిన సీనియర్ నాయకులు మామిడి శోభన్ బాబు
- బిఎస్పి గెలుపు ఖాయం అంటున్న ప్రజలు
- ప్రజా ఆశీర్వాదంతో నా గెలుపు తథ్యం
- బిఎస్పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్




# ఖాళీ అవుతున్న కారు.. పెరుగుతున్న ఏనుగు బలం

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట నియోజకవర్గంలో కారు జోరుకు బ్రేకులు పడుతున్నాయి. ఎన్నికల దగ్గర పడుతున్నా కొద్ది బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు వరుసగా బీఎస్పీ పార్టీలోకి క్యూ కడుతున్నారు. దీంతో ఏనుగు బలం పెరిగి పోతుండగా,కారు జోరు తగ్గుతుంది. కాంగ్రెస్ పార్టీ సైతం ప్రచారంలో వెనుకబడి పోయింది.దీంతో నియోజకవర్గం వ్యాప్తంగా బిఎస్పీ MLA అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకేనని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం 20వ వార్డు కౌన్సిలర్ అన్నేపర్తి రాజేష్,పెన్ పహాడ్ మండల సీనియర్ నాయకుడు మామిడి శోభన్ బాబు బి.ఎస్.పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ సమక్షంలో బిఎస్పి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీలో ప్రజా ప్రతినిధులకు గుర్తింపు లేదని అన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో మంత్రి కనీసం నాలుగు సార్లు కలిసే అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే రోడ్లు, స్మశాన వాటికలు కావని, ప్రజలకు కడుపు నింపే పథకాలు రావాలని అన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి అహంకారానికి బలైన వారు చాలామంది ప్రజాప్రతినిధులు ఉన్నారని,కానీ వారు బయటపడడం లేదని అన్నారు.నన్ను చూసి ఇకనైనా బయటికి రావాలని పిలుపునిచ్చారు. బహుజనులు అంతా ఏకమై వట్టె జానయ్య యాదవ్ గారిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఒక్కసారి గెలిపిస్తేనే దామోదర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా జగదీష్ రెడ్డికి అవకాశం కలిపిస్తే దోపిడి దొంగగా మారి సూర్యాపేట సంపదను దోచుకున్నాడని అన్నారు. మంత్రి తన మామ మధుసూదన్ రెడ్డి ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తే, వారు తప్పని పరిస్థితులో రోడ్డు ఎక్కితే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకోకపోతే మంత్రి జగదీష్ రెడ్డి ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. నా వద్దకు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు, ఫోన్లు కూడా టాప్ చేస్తున్నారని, మనం ప్రజాస్వామ్యంలోనే బతుకుతున్నామా అని ప్రశ్నించారు. అరాచకాలకు అక్రమాలకు పాల్పడుతున్న నాయకులకు నవంబర్ 30 వ తేదీన సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. పాచ్చనాయక్ తండాలో అభివృద్ధి చేయలేదని వెంటపడి తరిమిన మా అక్క చెల్లెళ్లకు కాళ్లు కడిగితే తప్పేముందని, దాన్ని కూడా అపహస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

46 జీఓ ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగినా మంత్రి దానిపై స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఆపద వస్తే 108 వచ్చిన విధంగా మీ ముందుకు వచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఏ గ్రామంలో ఏ ఇంటికి వెళ్లిన పూర్తిస్థాయి సహకారం అందించి గెలుపు దీవెనలు అందిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలంతా గమనించి బహుజనులు అంతా ఏకమై ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సీనియర్ నాయకుడు మామిడి శోభన్ బాబు మాట్లాడుతూ.. మంత్రి వద్దకు చేరాలంటే నాలుగు అంచెల విధానాన్ని దాటి వెళ్లాలని అన్నారు. పెన్ పహాడ్ మండలంలో ముగ్గురు అగ్ర నాయకుల ద్వారా మండలం నడిపిస్తున్న మంత్రి నియంత పాలన నచ్చక బిఎస్పీ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. వార్డు మెంబర్ గా కూడా గెలవని వ్యక్తికి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ పదవిని కట్టబెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకుల నాయకుల పెత్తనం పోవాలంటే బహుజనులు అంత ఏకమై బీఎస్పీ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు గండూరి పావని కృపాకర్, గండూరి రాధిక రమేష్, ధరావత్ నీలబాయి లింగ నాయక్, మీరా అక్బర్, కుంభం నాగరాజు, బత్తిని వెంకటేశ్, మోదుగు విజయ్, భారీ అశోక్, వట్యాల శేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాములపై కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు

**జయభేరి, సూర్యాపేట :**

జిల్లా కేంద్రంలో గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై బి ఆర్ యస్ పార్టీ 40 వ వార్డు కౌన్సిలర్ వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడు. గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు బాధితురాలు పిడమర్తి రేణుక నిరసన తెలిపి మాట్లాడారు ఈనెల 14వ తేదీన జిల్లా కేంద్రం 40 వ వార్డులో విధుల్లో భాగంగా చెత్త సేకరిస్తుండగా ఆటో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అడ్డుగా వచ్చి చెత్త బండిని తీయమనగా వెనుక సందులో నుండి వెళ్ళండి అని ఆమె తెలుపగా వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడు అని ఆమె తెలిపింది. ఇదే విషయమై 40 వార్డు కౌన్సిలర్ తాహీర్ పాషా దళిత మహిళ అని చూడకుండా కార్మికురాలని పిలిచి కులం పేరుతో దూషించి కులం పేరుతో నానా దుర్భాషలాడి పక్కనే ఉన్న చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్



ను సైతం దుర్భాషలాడాడని తెలిపారు. అదేవిధంగా ఇదే వార్డులో పదిమంది పారిశుద్ధ కార్మికురాలను సెలవులు పెడుతున్నారు అనే చిన్న కారణంతో విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెల్లగా మున్సిపల్ కమిషనర్ సంతకం పెట్టించుకుని రావాలని ఆ తర్వాతనే కేసు చేస్తామని పోలీసులు చెప్తున్నారని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పోలీసులు ఉన్నారు అనే భరోసా ప్రజలకు ఉండేది.కానీ ఇప్పుడు పోలీస్ అధికారులు ప్రజలకు భరోసా కల్పించే విధంగా లేరని తెలిపారు. ఇది ఎక్కడి న్యాయం ఒక మహిళను కులం పేరుతో దుర్భాషలాడారని ఫిర్యాదు చెయ్యడం కొరకు పోలీస్ స్టేషన్ కు వస్తే అధికారులు పట్టించుకోకుండా కమిషనర్ సంతకం పేట్టించుకోని రమ్మని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అన్నారు.వెంటనే మేము ఇచ్చిన ఫిర్యాదును తీసుకొని వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు.

**మాల వేసుకున్న దుర్భాషలాడడం ఆపని కౌన్సిలర్**

పవిత్ర మాసం సందర్భంగా మాల వేసుకుని నిష్టగా ఉన్న స్వామిని వార్డు కౌన్సిలర్ తాహీర్ పాషా వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డాడు అని బాధితుడు జిల్లా జానీ ఆవేదన వ్యక్తం చేశాడు.కనీసం అక్కడ ఏం జరిగిందో కూడా విషయం అడగకుండా మాపై ఆగ్రహం వ్యక్తం చేశాడని అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.కౌన్సిలర్ దుర్భాషలాడాడని తెలియజేసేందుకు కమిషనర్ వద్దకు మున్సిపల్ దళిత కార్మికురాలు వెళ్ళగా కమిషనర్ కూడా దౌర్జన్యంగా ఏమీ వినకుండా ఏమి చేసుకుంటారో చేసుకోండి అంటూ బయటకి పంపించారు.



# డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ కు హైకోర్టులో ఊరట

**హత్యాయత్నం కేసులో అరెస్టు చేయవద్దంటూ పోలీసులకు ఆదేశం**

**జయభేరి, హైదరాబాద్ :**

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ కు హైకోర్టులో ఊరట లభించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నుంచి ఎన్నికల బరిలో నిలిచిన ఆయన ఈ నెల 12 న కాగజ్ నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా బీఎస్పీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగిన చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరుని పిర్యాదు మేరకు ఆయనతో సహా 16 మందిపై హత్యాయత్నంతో పాటు దొంగతనం కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు జిల్లా ఎస్పీ అనుకూలంగా వ్యవహరిస్తూ బీఎస్పీ ర్యాలీలకు పర్మిషన్ల పేరుతో అడుగడుగునా పోలీసుల అడ్డంకులు సృష్టించడంతో కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్ ముందు పార్టీ శ్రేణులతో కలిసి అర్థరాత్రి బైఠాయించి నిరసన తెలిపారు. అక్రమ కేసులపై హైకోర్టులో క్వాష్ పిటీషన్ దాఖలు చేయగా గురువారం ప్రవీణ్ కుమార్ ను అరెస్టు చేయవద్దంటూ హైకోర్టు పోలీసులను ఆదేశించింది.




# థ్యాంక్స్ టూ పాండ్య

**జయభేరి, ముంబై, నవంబర్ 16 :**

వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా బుధవారం న్యూజిలాండ్తో జరిగిన మొదటి సెమీ ఫైనల్లో భారత్ 70 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. విరాట్ కోహ్లీ (117; 113 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (105; 70 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లు) అద్భుత సెంచరీలతో పాటు మహమ్మద్ షమీ (7/57) సూపర్ బౌలింగ్తో భారత్ విజయం సాధించింది. 7 వికెట్స్ పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన షమీపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. సోషల్ మీడియాలో షమీ పేరు ట్రెండ్ అవుతోంది. అయితే అనూహ్యంగా స్టార్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు కూడా నెట్టింట ట్రెండ్ కావడం గమనార్హం. హార్దిక్ సరైన సమయంలో గాయపడ్డావు, నీకు పెద్ద థ్యాంక్స్ అని ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.విషయం ఏంటంటే.. వన్డే ప్రపంచకప్ 2023 ఆరంభంలో మహమ్మద్ షమీ ఆడలేదు. జట్టు సమీకరణల కారణంగా లీగ్ దశలోని మొదటి నాలుగు మ్యాచ్లలో షమీకి చోటు దక్కలేదు. బంగ్లాదేశ్తో జరిగిన మ్యాచ్లో హార్ధిక్ పాండ్యా గాయపడటంతో.. మూడో పేసర్ కోటాలో షమీకి తుది జట్టులో అవకాశం వచ్చింది. న్యూజిలాండ్తో జరిగిన లీగ్ మ్యాచ్లో 5 వికెట్లతో విజృంభించాడు. ఆడిన మొదటి మ్యాచ్లోనే సత్తాచాటిన షమీ.. తన ప్రదర్శన గాలి వాటం కాదని నిరూపించాడు. శ్రీలంకలపై ఐదు వికెట్స్ పడగొట్టాడు. ఇంగ్లండ్పై నాలుగు వికెట్స్ తీసిన షమీ.. దక్షిణాఫ్రికాపై 2 వికెట్స్ పడగొట్టాడు.నెదర్లాండ్స్పై ఒక్క వికెట్ తీయని మహమ్మద్ షమీ.. కీలక సెమీస్ మ్యాచ్లలో సంచలన బౌలింగ్తో ఆకట్టుకున్నాడు. ఏకంగా 7 వికెట్స్ పడగొట్టి భారత జట్టుకు అద్భుత విజయం అందించాడు. కేవలం 6 మ్యాచ్ల్లోనే 23 వికెట్లతో వన్డే ప్రపంచకప్ 2023లో లీడింగ్ వికెట్ టేకర్గా కొనసాగుతున్నాడు. ఒకవేళ హార్దిక్ పాండ్యా గాయపడకపోయి ఉండుటే.. కాంబినేషన్ల కారణంగా షమీకి తుది జట్టులో చోటు దక్కడం కష్టం అయ్యేది. అప్పుడు టీమిండియాకు ఎలాంటి విజయాలు వచ్చేవి కావేమో. అందుకే గాయపడి షమీ ఆడేందుకు అవకాశం కల్పించిన పాండ్యాకు ఫ్యాన్స్ థ్యాంక్స్ చెబుతున్నారు. హార్దిక్ సరైన సమయంలో గాయపడ్డాడు, చాలా థ్యాంక్స్, హార్దిక్ మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ అంటూ సరదాగా పోస్టులు పెడుతున్నారు.



# సరికొత్త ఫాంటసీ ప్రపంచం

'బింబిసార' చిత్రంతో ఒక్కసారిగా పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు యువ దర్శకుడు వశిష్ఠ. చరిత్ర, వర్తమానాన్ని అనుసం ధానిస్తూ వినూత్న ఫాంటసీ కథాంశంతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ఆయన తదుపరి చిత్రంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొద్ది వారాల క్రితం విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్ పంచభూతాల థీమ్‌తో ఆసక్తిని రేకెత్తించింది. తొలి చిత్రం తరహాలోనే సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో దర్శకుడు వశిష్ఠ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ కథలో ఆధ్యాత్మిక అంశాలు ప్రధానంగా ఉంటాయని ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు వశిష్ఠ తెలిపారు. ఆయన మాట్లా డుతూ 'చిరంజీవిగారు పూర్తి స్థాయి ఫాంటసీ కథలో నటించి చాలా రోజులైంది. అందుకే ఆయన కోసం పంచభూతాలు, త్రిశూల శక్తి అనే అంశాలకు ఆధ్యాత్మికత కలబోసి అద్భుతమైన కథను సిద్ధం చేశా. ఈ సినిమాలో 70 శాతం వరకు గ్రాఫిక్స్ ఉంటాయి. ప్రేక్షకులకు ఓ సరికొత్త ఫాంటసీ ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి 'విశ్వంభర' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# ఎత్తైన కొండపై సమంత.. ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..?

వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది సమంత. గ్లామరస్ పాత్రలతోపాటు లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్టులు చేస్తూ యశోద సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్న సామ్.. గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన శాకుంతలం సినిమాతో ప్రేక్షకు లు, అభిమానులను కొంత నిరాశకు గురిచేసింది. ఇటీవలే విజయ్ దేవరకొండతో కలిసి నటించిన ఖుషి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం అమెరికన్ ఫిల్మ్ చెన్నై స్టోరీస్‌తోపాటు హిందీ ప్రాజెక్ట్ సిటడెల్ వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండే సామ్ కొంతకాలంగా ఎక్కువ సమయాన్ని వెకేషన్లకు కేటాయిస్తుందని తెలిసిందే. ఈ బ్యూటీ తాజాగా ఓ ఎత్తైన కొండపై ఉన్న అరుగు మీద కూర్చుంది. పక్కనే మరో వ్యక్తి కూడా ఉన్నారు. ఇంతకీ ఈ బ్యూటీ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. సామ్ పొరుగు దేశం భూటాన్‌కు స్నేహితులతో కలిసి టూర్ వేసింది. కొండపై నుంచి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ.. సరదా సమయాన్ని గడిపింది. ఇంతకీ సామ్ పక్కనే ఉన్న మరో వ్యక్తి ఎవరో తెలుసా..? డిజైనర్ క్రేషా బజాజ్. ఈ ఇద్దరితో కలిసి వెకేషన్‌లో ఉన్న ఇంకో వ్యక్తి ఎవరనేది తెలియాల్సి ఉంది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం సిటడెల్ షూట్‌లో భాగంగా బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్ అండ్ టీంతో ఇంగ్లాండ్‌లో దిగిన స్టిల్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. రాజ్‌డీకే దర్శకత్వంలో సిటడెల్ ఇండియన్ వెర్షన్‌లో వరుణ్‌ధవన్, సమంత నటిస్తున్నారని తెలిసిందే.



# సినిమా ఎలా ఉండబోతుందో..?

నాకు థ్రిల్లర్స్ అంటే చాలా ఇష్టం.. స్కిన్ మాఫియా చుట్టూ తిరిగే అంశాలపై ఫోకస్ పెట్టే డార్క్ థ్రిల్లర్ కథాంశంతో సినిమా సాగుతుంది. ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా రావడం ఇదే తొలిసారి. ఇందులో శృతి యాడ్ ఏజెన్సీలో పనిచేస్తుంది. శృతి ఏ విషయాన్ని అంత తేలికగా తీసుకోని ఓ ఫైటర్. మా అమ్మ డెర్మటాల జిస్ట్ (చర్మ వ్యాధి నిపుణులు). స్కిన్ మాఫియా నిజంగా జరిగిందా..? అని అడిగా. స్కిన్ మాఫియా గురించి చది వినట్టు అమ్మ నాతో చెప్పింది. సామాన్య ప్రజలకు ఈ మాఫియా గురించి అంతగా తెలియదని చెప్పారు. తన పరిశోధనలో తేలిన కొన్ని విషయాల ఆధారంగా డైరెక్టర్ శ్రీనివాస్ ఓంకార్ సినిమా చేశారు. స్క్రిప్ట్‌కనుగుణం గా వెళ్లడం చాలా సవాలుతో కూడిన అంశం. కథలో చాలా ట్విస్టులు, మలుపులుంటాయి. థ్రిల్లర్ స్పేస్‌లో సినిమా చేయడం నాకు చాలా నచ్చింది. సినిమా రూపుదిద్దుకున్న తీరు పట్ల సంతోషంగా ఉంది. నా చేతిలో ఎప్పటికీ తమిళ సినిమాలు ఫుల్‌గా ఉంటాయి. అక్కడ చాలా బిజీ.. అందుకే తెలుగు సినిమాల విషయంలో గ్యాప్ వచ్చింది. నా కెరీర్ విషయంలో ఎలాంటి విచారం లేదు. చాలా సంతృప్తికరంగా ఉన్నప్పటికీ.. నేనింకా చాలా సాధించాలనుకుంటున్నా. నా కెరీర్ తొలినాళ్లలో అల్లు అర్జున్, ప్రభాస్‌తో కలిసి పనిచేసినందుకు గర్వపడుతున్నా. వారి సినిమాలు భాషాసరిహద్దులను చెరిపేశాయి. ఉన్నత స్థాయికి చేరుకున్నా.. ఒదిగి ఉండే స్వభావం కలిగిన వ్యక్తులు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా

టాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన రెండేళ్ల వ్యవధిలోనే అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది అచ్చ తెలుగందం శ్రీలీల. పెద్ద హీరోల చిత్రాల్లో నాయికగా తొలుత ఈ భామ పేరునే పరిశీలిస్తున్నారంటే ఈ అమ్మడి క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీలీల ప్రస్తుతం అరడజనుకు పైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఓ వైపు వైద్య విద్యను అభ్యసిస్తూనే మరోవైపు వెండి తెరపై రాణిస్తున్నది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్‌పరంగా ప్రతి అమ్మాయి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, ఒకే రంగాన్ని నమ్ముకోవద్దని సూచించింది. తన తల్లిదండ్రులకు ఇచ్చిన మాట ప్రకారం ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిలో కూడా సక్సెస్ అవుతానని ధీమా వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'డాక్టర్ కావాలన్నది నా చిన్ననాటి కల. ఆ విషయంలో నా పేరెంట్స్ కూడా ఎంతగానో ప్రోత్సహించారు. ఇక నటిగా ఇంతమంది అభిమానం సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఏదీఏమైనా డాక్టర్ కావడం నా తొలి ప్రాధాన్యతగా నిర్ణయించుకున్నా. ఆ వృత్తిలో వచ్చే సంతృప్తి వేరు. ప్రతి అమ్మాయి తమ ప్రతిభ మేరకు అభిరుచి ఉన్న రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి' అని చెప్పింది. ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'ఆదికేశవ' ఈ నెల 24న విడుదలకు సిద్ధమవుతున్నది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com